క్లుప్తంగా

గురుకులంలో వైద్యశిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

మణుగూరు రూరల్ : మండలంలోని రాజీవ్ గాంధీ నగర్‌లోని మహాత్మా జ్యోతిరావుపూలే బీసీ బాలుర పాఠశాలలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్ నిశాంత్‌రావు విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించాలని, తడి దుస్తులు ధరించొద్దని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలోని గాంధీబొమ్మ సెంటర్‌లో స్పర్శ లెప్రసీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సత్తెమ్మ, స్వరూప, హెల్త్ ఎడ్యుకేటర్ పరంగిని, వైద్య సిబ్బంది రాంప్రసాద్, కృష్ణ, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న నాయకులు

చంద్రుగొండ: ఇటీవల మృతి చెందిన మండలంలోని ఎలక్ట్రీషియన్ సోము వెంకటాచారి కుటుంబానికి ఎలక్ట్రీషియన్ల సంఘం మండల అధ్యక్షుడు దాసరి కృష్ణ గురువారం రూ.6 వేలు ఆర్థికసాయం అందించారు. అంతకుముందు వెంకటాచారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు ఆసీఫ్ పాషా, బదుగు రాములు, ఐనోలు లక్ష్మణ్, సీహెచ్.సతీష్, రాము తదితరులు పాల్గొన్నారు.

పొదుపు అలవర్చుకోవాలి

ములకలపల్లి: రోజువారీ సంపాదనలో ఎంతో కొంత విధిగా పొదుపు చేయడం అలవర్చుకోవాలని మండల సెంట్రల్ ఫర్ ఫైనాన్షియల్ లిట్రసీ ఆర్‌బీఐ కౌన్సిలర్ నవీన్‌బాబు సూచించారు. మండలపరిధిలోని పూసుగూడెంలో ఎస్‌హెచ్‌జీ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎస్‌హెచ్‌జీ వీవోఏ అనూష, కరుణ, వీఓ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా

దమ్మపేట: మండల కేంద్రంలో ఉన్న శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయ 30 వార్షికోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో వేకువజాము నుండే బాబాకు అర్చన, అభిషేకం తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానాన్ని ప్రారంభించారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లను చేశారు.

అన్నదానం



అన్నదాత దంపతులను సన్మానిస్తున్న కమిటీ

మణుగూరు రూరల్ : మండలంలోని సాయినగర్‌లోఉన్న శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. మండలానికి చెందిన యగ్గడి నరసింహారావు–నాగేశ్వరి దంపతులు, శ్రీనివాస్–భవాని దంపతులు, అశ్వినీలు ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదాత దంపతులను ఆలయకమిటీ సభ్యులు సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దోసపాటి నాగేశ్వరరావు, సీహెచ్ బాలకేశవరావు, అర్చకులు పవన్ కుమార్ వర్మ, గుమస్తా వెంకన్న, సాయి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు ప్రాంగణం..

నిరుపయోగంగా మారిన ఆర్టీసీ బస్టాండ్
- ప్రయాణికులకు నిలువ నీడ కరువు
- రూ.లక్షల ప్రజాధనం వృథా



నిరుపయోగంగా మారిన మండలకేంద్రంలోని బస్టాండ్

అశ్వాపురం: మండల కేంద్రంలో అమెర్ద రహదారి వెంబడి బస్టాండ్ ఎన్నో ఏళ్లుగా నిరుపయోగంగా మారింది. లక్షల రూపాయలతో ఆర్టీసీ వారు నిర్మించిన బస్టాండ్ శిథిలావస్థకు చేరింది. బస్టాండ్ లేక మండల ప్రజలు, ప్రయాణికులు ప్రధాన రహదారి వెంబడి ఎండల్లో మగ్గుతూ బస్సుల కోసం పడిగాపులుగాస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉండగా మండలకేంద్రంలో ఉన్న చెట్లు సైతం నరికివేయడంతో ప్రయాణీలకు నిలువ నీడ కరువైంది. ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నా సమస్యను పట్టించుకునేవారు కరువయ్యారని వాపోతున్నారు.

ప్రయాణికులకు తప్పని తిప్పలు..

మండల కేంద్రం నుంచి ఇతర దూర ప్రాంతాలకు వందల మంది ప్రయాణికులు ప్రయాణిస్తుంటారు. బస్టాండ్ లేక వృద్ధులు, చిన్నారులు, మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మరుగుదొడ్ల, తాగునీరు కనీస సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నారు. లక్షల రూపాయలతో నిర్మించిన బస్టాండ్ నిరుపయోగంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్టాండ్‌ను ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రజలు ఎన్నో ఏళ్లుగా అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మండల కేంద్రంలో బస్టాండ్‌ను ఉపయోగంలోకి తీసుకొచ్చి కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

ఉపయోగంలోకి తీసుకురావాలి



బస్టాండ్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డు వెంబడి ప్రయాణికులకు నీడ నిచ్చే చెట్లను కూడా తొలగించడంతో ఎండల్లో ప్రయాణికులూ అవస్థలు పడుతున్నారు. కనీసం మరుగుదొడ్ల సౌకర్యం కూడా లేదు. బస్టాండ్‌ను ఉపయోగంలోకి తీసుకురావాలి. లేనిపక్షంలో నూతన బస్టాండ్ నిర్మించాలి.

– ఇసంపల్లి కృష్ణ, అశ్వాపురం

మంత్రుల దృష్టికి తీసుకెళ్తాం



ఎన్నో ఏళ్లుగా మండల కేంద్రంలో బస్టాండ్ సౌకర్యం లేక ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. ఎండల్లో ప్రయాణికులు, వృద్ధులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్ సమస్యను ఎమ్మెల్యే, మంత్రుల దృష్టికి సమస్య తీసుకెళ్తాం.

– గాదె కేశవరెడ్డి, కాంగ్రెస్ నాయకులు

ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం..

మండల కేంద్రంలో ప్రధాన రహదారి వెంబడి బస్‌షెల్టర్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. అమెర్ద రహదారి వెంబడి ఉన్న బస్టాండ్ వినియోగంలోకి తెచ్చినా లోపలికి ఉండటంతో ప్రజలు ఉపయోగించడం లేదు. రహదారి వెంబడి బస్‌షెల్టర్ నిర్మాణానికి స్థలం కోసం గ్రామ పంచాయతీ వారికి లేఖ రాస్తాం. ప్రజలకు ఇబ్బంది లేకుండా బస్‌షెల్టర్ నిర్మాణంకు కృషి చేస్తాం.

– స్వామి, మణుగూరు డిపో మేనేజర్

గ్రామ సమస్యలపై దృష్టి సారించాలి

- డీఎల్పీఓ సుధీర్ కుమార్



రికార్డులు పరిశీలిస్తున్న సుధీర్‌కుమార్

పినపాక: గ్రామ పంచాయతీలో ప్రాథమికంగా ఉండే సమస్యలపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని డీఎల్పీఓ సుధీర్ కుమార్ సూచించారు. ఈ మేరకు గురువారం ఆయన మండలంలో ఆకస్మికంగా పర్యటించారు. ఎంపీఓ వెంకటేశ్వరరావుతో కలిసి సీతారామపురం పంచాయతీలో డంపింగ్‌యార్డ్, శ్మశాన వాటిక, కంపోస్ట్ ఎరువు తయారు చేసే విధానాన్ని పరిశీలించారు. ప్రతీరోజు సేకరించిన చెత్తలో తడి, పొడి చెత్తను వేరుచేసి కంపోస్ట్ ఎరువుగా తయారు చేయడాన్ని పరిశీలించి సూచనలు సలహాలు చేశారు. సెక్రటరీలు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. వేసవిలో తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి, పైప్ లీకేజీ పనులు ఉంటే సత్వరమే పరిష్కరించాలన్నారు. అనంతరం సీతంపేట, భూపాలపట్నం పంచాయతీల్లో రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

కష్టపడ్డ వారిని పార్టీ విస్మరించదు..



నియామకపత్రం అందజేస్తున్న పొదెం వీరయ్య

భద్రాచలంటౌన్: కాంగ్రెస్ పార్టీ కష్టపడ్డ ఎవర్నీ విస్మరించదని డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య అన్నారు. కాంగ్రెస్ ఎస్సీ సెల్ భద్రాచలం నియోజకవర్గ చైర్మన్‌గా రావుల నరేంద్ర కుమార్‌ను నియమిస్తూ గురువారం నియామకపత్రం క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుదీర్ఘకాలం పార్టీకి పనిచేసినందుకు తగిన గుర్తింపు లభించిందన్నారు. అనంతరం నాని మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నరు. ఈ కార్యక్రమంలో భద్రాది కొత్తగూడెం, ములుగు జిల్లాల ఎస్సీ సెల్ చైర్మన్‌లు చింతిరియాల రవి, దాసరి సుధాకర్, కాంగ్రెస్ నాయకులు కిరణ్ కుమార్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ పథకాలే గెలుపునకు నాంది



మాట్లాడుతున్న రేగా కాంతారావు

దుమ్ముగూడెం : సీఎంగా కేసీఆర్ చేసిన అభివృద్ధి, ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపునకు నాంది అని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అన్నారు. గురువారం భద్రాచలం నియోజకవర్గ పర్యటన లో భాగంగా మండలంలోని తూరుబాక, బి కొత్తగూడెం, సింగవరం, దంతెనం, బండిరేవు గ్రామ పంచాయతీల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు... కాంగ్రెస్ చేస్తున్న ప్రజా వ్యతిరేక పాలనను ప్రజలకు తెలియజేయాలన్నారు. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రంలో ప్రతీ కుటుంబం ఏదో ఒక రూపంలో పథకాలు పొందిందని, ప్రతీ గ్రామానికి అభివృద్ధి ఫలాలు అందాయన్నారు. ఈ కార్యక్రమంలో రావులపల్లి రాంప్రసాద్, మానె రామకృష్ణ, వాసురాజు, మండల కన్వీనర్ కణితి రాముడు, కో కన్వీనర్ ఎండి.జానీ పాషా, మాజీ ఎంపీపీ రేసు లక్ష్మి, సొసైటీ డైరెక్టర్లు బొల్లి వెంకట్రావు, కాలవ పూర్ణయ్య, కామేష్, బుజ్జి, దామెర్ల శ్రీనివాసరావు, వాగే వెంకటేశ్వరావు, జుంజురి జయసింహా తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల కడుపు మాడుస్తున్న ప్రభుత్వం



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా వాళ్ల కడుపులు మాడుస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్న ప్రభుత్వం చర్యలను నిరసిస్తూ గురువారం ఆస్పత్రి ఎదుట శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బంది ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎంబి.నర్సారెడ్డి మాట్లాడుతూ.. కార్మికులకు ఇచ్చే అరకొర వేతనాలు కూడా సక్రమంగా సకాలంలో ఇవ్వకపోవడం వలన వారి ఆర్థిక పరిస్థితి మరింత దిగజారి, వస్తువులను తనకా పెట్టుకుని జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు విడుదల చేయకపోతే ఈ నెల 15 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. అనంతరం సూపరింటెండెంట్ డాక్టర్ ముదిగొండ రామకృష్ణకు వినతిపత్రం అందించారు. నాయకులు శివాజీ, అజయ్ కుమార్, రాఘవయ్య, రమ, రమణమ్మ, కృష్ణ, నరేంద్ర, రమేష్ , వరలక్ష్మీ, అంజలి కుమారి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న బ్యాంక్ మేనేజర్ రాజు

అశ్వారావుపేటరూరల్: విద్యార్థులు బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కెనరా బ్యాంక్ మేనేజర్ బి.రాజు కోరారు. గురువారం మండలంలోని పెదవాగు ప్రాజెక్ట్ గ్రామంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల డిగ్రీ కళాశాలలో 'ఆకాంక్ష మీది–భరోసా మాది' అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత తప్పనిసరిగా పొదుపు ఖాతాలను తీసుకోవాలని కోరారు. అనంతరం కళాశాల అధ్యాపకుల బృందం ఆధ్వర్యంలో మేనెజర్‌ను ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపాల్ వి.స్పందన, కో ఆర్డినేటర్ ఉమా, స్పందన తదితరులు పాల్గొన్నారు.

ఐలయ్య స్ఫూర్తితో ఉద్యమాలు



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

భద్రాచలంఅర్బన్: కాసాని ఐలయ్య స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు అన్నారు. కాసాని ఐలయ్య సంతాప సభ గురువారం పార్టీ కార్యాలయంలో పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలయ్య చిత్రపటానికి పార్టీ నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భద్రాచలంకు బీజేపీ ద్రోహం చేస్తుందని, పాలకులు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా క్షేత్రస్థాయిలో ఉద్యమాలు నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి, బ్రహ్మచారి, జిల్లా కమిటీ సభ్యులు బండారు శరత్‌బాబు, నాయకులు తిలక్, వెంకటరామారావు, సీతాలక్ష్మీ పాల్గొన్నారు.

నైపుణ్యాలను గుర్తించేందుకే 'బాలమేళా'



ప్రదర్శనలతో విద్యార్థులు

అశ్వారావుపేటరూరల్: ప్రాథమిక స్థాయి విద్యార్థుల్లో ఉండే సృజనాత్మక నైపుణ్యాలను గుర్తించడం, ప్రతిభను గుర్తించడమే బాలమేళా కార్యక్రమ లక్ష్యమని అశ్వారావుపేట ఎంఈఓ ప్రసాదరావు అన్నారు. గురువారం మండలంలోని మామిళ్లవారిగూడెం కాంప్లెక్స్ పరిధిలోని తిరుమలకుంట, తోగ్గూడెం, గుర్రాల చెరువు, వడ్డెర రంగాపురం, వినాయకపురం పాఠశాలల్లో నిర్వహించిన బాలమేళా ఉత్సవాలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన వాటిని ప్రదర్శించగా, ఎంఈవో వాటిని పరిశీలించి అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హామీల అమలులో నిర్లక్ష్యం వీడాలి



ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ) : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల నేపథ్యంలో ఇచ్చిన హామీలు హాస్యాస్పదంగా మారాయని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు ఎస్‌కె.ఉమర్ విమర్శించారు. మండలంలోని బుచ్చనగూడెంలో గురువారం ప్రదర్శన నిర్వహించి అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఉచిత బస్సు ప్రయాణం మినహాయించి రైతులకు, కూలీలకు, సామాన్య ప్రజలకు ఇచ్చిన హామీలు ఏమైయ్యాయని ప్రశ్నించారు. రైతులను ఊరించి వేధిస్తున్నారన్నారు. నాయకులు కోంద్రు ధర్మరాజు, కీసరి రామారావు, గడ్డం కృష్ణయ్య, సంగీతరావు, వెంకటేశ్వర్లు, శివ, మల్లేష్ పాల్గొన్నారు.

'ప్రజా వ్యతిరేకంగా బడ్జెట్'

చర్ల: కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజావ్యతిరేకమైనదని, దీంతో ఏ వర్గాలకు చెందిన ప్రజలకూ న్యాయం జరగదని సీపీఎం నాయకులు అన్నారు. ఈ మేరకు పార్టీ ఆధ్వర్యంలో బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ గురువారం చర్లలో ధర్నా నిర్వహించారు. స్థానిక బీఎస్ రామయ్య భవన్ నుంచి ప్రదర్శనగా అంబేడ్కర్ సెంటర్ వరకు వచ్చిన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి మచ్చా రామారావు, నాయకులు కారం నరేష్, వరదల లక్ష్మి, పామారు బాలాజీ, ఐద్వా అధ్యక్ష కార్యదర్శులు పొడుపుగంటి సమ్మక్క, తాటి నాగమణి, బందెల చంటి, షారోను పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు

టెండర్లు పిలిచి ప్రూనింగ్ చేపట్టాలి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఏజెన్సీలో తునికాకు టెండర్లు పిలిచి ప్రూనింగ్ పనులు వెంటనే చేపట్టాలని సీపీఐ డివిజన్ కార్యదర్శి కల్లూరి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం పార్టీ స్థానిక కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సభ్యులు రావులపల్లి రవికుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తునికాకు సేకరణ ఈ ప్రాంత ఆదివాసీలకు ఆదాయాన్ని సమకూరుస్తుందని, సేకరణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నేటికీ టెండర్లు పిలవలేదన్నారు. ఇప్పటికైనా టెండర్లు పిలిచి అదును దాటకముందే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారెడ్డి శివాజీ, సీతారామరాజు, వెంకన్న, రామారావు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి



మాట్లాడుతున్న రాంబాబు

ములకలపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు డిమాండ్ చేశారు. మండలపరిధిలోని వేముకుంట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను గురువారం మండల కమిటీ బృందం గురువారం సందర్శించింది. పాఠశాలలో మరుగుదొడ్లు, తరగతిగదులను నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో 'మన ఊరు – మన బడి' పేరిట పాఠశాలల మరమ్మతులు చేపట్టినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే తీరున ఉందన్నారు. అధికారులు స్పందించి ఇకనైనా వసతుల కల్పనపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో సోయం వీరస్వామి, దేవేందర్, రాఘవయ్య, రాజమ్మ, రాఘవమ్మ, సమ్మక్క నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

దమ్మపేట : జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు అమర్లపూడి రాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ... ఎన్నికల హామీల్లో భాగంగా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని ప్రకటించిన కాంగ్రెస్, నేడు ఆ హామీని పూర్తిగా విస్మరించిందన్నారు. ప్రజా సమస్యలపై తమ కలంతో గళం విప్పుతున్న జర్నలిస్టులను ప్రభుత్వమే అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయని పక్షంలో ప్రజా పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు.

12 నుంచి కట్ట మైసమ్మ జాతర



జాతరకు సిద్ధమవుతున్న కట్ట మైసమ్మ ఆలయం

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారాయణపురం గ్రామ శివారులో కొలువై ఉన్న శ్రీ కట్టమైసమ్మ తల్లి అమ్మవారి ఆలయం జాతర ఉత్సవాలకు సిద్ధమంది. ఈ మేరకు ఈ నెల 12 నుంచి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లను ప్రారంభించారు. తొలి రోజు 12న ఉదయం గ్రామంలో తోరణాలు కట్టి అమ్మవారి ఆలయంలో విఘ్నేశ్వర పూజలతో ఉత్సవాలు ప్రారంభిస్తారు. 13న అమ్మవారికి నిత్యపూజతోపాటు అష్టోత్తరకలశ ఆరాధన, కలశ గ్రామోత్సవం, 14న సామూహిక కుంకుమ పూజలు, 15న సామూహిక విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం , నీరాజన మంత్ర పుష్పాలు, 16వ తేదీ ముగింపు రోజున అమ్మవారికి విశేష పూజలు, నైవేద్యాలు, మంగళవాయిద్యాలతో ఉత్సవాలు ముగిస్తారు. ప్రతీ రోజు సాయంత్రం అమ్మవారికి కొలువులు, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాట్లు చేసినట్లు కమిటీ తెలిపింది. ఈ ఉత్సవాలకు అశ్వారావుపేట, దమ్మపేట మండలాలతోపాటు పొరుగున ఉన్న ఏపీలోని ఏలూరు జిల్లా వేలేరుపాడు, కుక్కునూరు, జీలుగుమిల్లి మండలాల నుంచి కుడా భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లిస్తారు. భక్తులకు ఇబ్బందులు రాకుండా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు.

ప్రధాన రహదారే పార్కింగ్ స్థలం..!

- రోడ్డుపైనే లారీలు నిలిపివేత, మరమ్మతులు
- యజమానులకు లెక్కలేని అధికారుల ఆదేశాలు



రోడ్డుపై ఇరువైపులా నిలిపి ఉంచిన లారీలు, టిప్పర్లు

మణుగూరు టౌన్: పట్టణంలోని లారీ యూనియన్ ఆఫీస్ కార్యాలయం వద్ద ప్రధాన రహదారికి ఒక వైపు లారీలు, మరోవైపు టిప్పర్లు యథేచ్ఛగా నిలిపి ఉంచి మరమ్మతులు నిర్వహిస్తుండటంతో అటుగా ప్రయాణించాలంటేనే ప్రజలు జంకుతున్నారు. మూడు రోడ్ల కూడలి, పట్టణానికి ప్రధాన రహదారి కావడంతో భారీ వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. మణుగూరు ఓసీ నుంచి కేసీహెచ్‌పీకి వచ్చే బొగ్గు లారీలతో పాటు సింగరేణి నుంచి బీటీపీఎస్‌కు నిత్యం తిరిగే బొగ్గు టిప్పర్లతో రద్దీ సర్వసాధారణం. అదే ప్రదేశంలో రోడ్డుకు ఇరువైపులా లారీ యూనియన్, 14 టిప్పర్ల కార్యాలయాలు ఉండటంతో పాటు టైర్ల దుకాణాలు, కట్టల పనులు చేయించుకునేందుకు లారీలు నిలిపి దారి పొడువునా వాహనాలకు మరమ్మతులు చేయడంతో మోటార్ సైకిళ్లు, వాహనదారులు అటువైపుగా ప్రయాణించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. పోలీసులు పలుమార్లు వాహనాలు నిలపొద్దని, రోడ్డుకి దూరంగా నిలిపి ఉంచాలని సూచించినా యజమానులు పట్టించుకోకపోవడం లేదని ఏదైనా ప్రమాదం సంభవించి ప్రాణాలు పోతే దహన సంస్కారాలకు రూ.20 వేలు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని స్థానిక ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. మానవతా దృక్పథం మరుస్తూ ప్రమాదాలకు కారకులవుతూ యథేచ్ఛగా రోడ్లపై నిలిపి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న లారీ యజమానులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.